# గ్రామసభ

**రాష్ట్రంలో జన్మభూమి** కార్యక్రమం జరుగుతోంది. బడిలో పచ్చదనం, పరిశుభ్రత పాటించడంతో పాటు ర్యాలీ నిర్వహించడం తరగతి గదులకు వెల్ల వేయడంలాంటి పనుల్లో విద్యార్థులంతా తనమునకలై ఉన్నారు.

పిల్లల్ని గ్రూపులుగా గ్రామంలోకి తీసుకువెళ్లి రోడ్లు ఊడ్పిస్తున్నారు ఉపాధ్యాయులు.

ఇండ్లలోని చెత్తను రోడ్లమీద వేయవద్దంటూ డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రకాశంగారు రోజూ ప్రార్థనా సమావేశంలో బాలబాలికలచే తెలుగుతల్లి గీతాలాపన చేయిస్తున్నారు.

గ్రామంలో సందడి మొదలైంది. ఫలితంగా పంచాయతీ భవనం, గ్రంథాలయం ముస్తాబై ముచ్చట గొలుపుతున్నాయి.

జన్మభూమి చివరి రోజున విద్యార్థులు ఊరేగింపుగా ఊళ్ళోకెళ్లి మానవహారంలో పాల్గొంటున్నారు.

జన్మభూమి ప్రతిజ్ఞానంతరం గ్రామసభ జరుగుతుంది. సభకు ఎమ్మెల్యేగారు, కలెక్టరుగారితో పాటు ఉన్నతాధికారులంతా హాజరవుతారు. అలసత్వం, అవినీతికి పాల్పడే ఉద్యోగుల్ని సస్పెండ్ చేస్తున్నట్లు పత్రికల్లో వార్తలు గుప్పుమనడంతో ఉపాధ్యాయుల గుండెల్లో దడ మొదలైంది. అదే విషయాన్ని ఆఫీసు రూములో కూర్చుని హెడ్మాస్టర్‌గారితో చర్చించు కుంటున్నారు.

"మనలో లోపమేదీ లేనప్పుడు భయపడవలసిన పనేముంది? ప్రభుత్వ ఆదేశాల్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం. అందుకు మనల్ని అధికారులు అభినందిస్తారే తప్ప ఆక్షేపించలేరు" ధీమా వ్యక్తం చేసారు ప్రకాశంగారు.

"మీరన్నది నిజమే. అయితే మన జిల్లా కలెక్టర్ లేడీ అవడం వల్ల భయంగా ఉంది. తొందరపాటు చర్య తీసుకోవడంలో పురుషులకంటే మహిళలే ముందుంజలో ఉంటారు. పైగా ఈవిడ చండశాసనురాలని విన్నాం. మొన్న మన ప్రక్క మండలంలో ఓ ఉద్యోగి మీద కఠినచర్య తీసుకున్నారట. ఎంతటి వాడినైనా ఈమె లెక్కచేయరట" స్త్రీల మనస్తత్వాన్ని అవపోసన పట్టినట్లుగా అన్నారు. సైన్సు మాష్టారు.

"విధి నిర్వహణలో మనం ఎంత అప్రమత్తంగా వున్నా ఎక్కడో ఒకచోట పొరపాటు దొర్లకపోదు. దానినే మనవాళ్ళు భూతద్దంలో చూపిస్తారేమోనని" సందేహం వెలిబుచ్చారు సోషలు మాష్టారు.

"కానివ్వండి. ఎలానూ రోట్లో తలదూర్చాం" అన్నారు ప్రకాశంగారు. ఆయన బయటకు అలా అంటున్నా అతని గుండె సవ్వడి అందరికీ స్పష్టంగా వినిపిస్తూనే ఉంది.

గ్రామసభ మొదలైంది.

ఎమ్మెల్యేగారు, కలెక్టర్‌గారు, నోడల్ అధికారి వేదిక మీద కొచ్చారు.

ఎమ్మెల్యేగారు ఒక్కొక్క అధికారిని పిలిచి వారి పనితీరును ప్రశ్నిస్తున్నారు.

గ్రామస్థులు కొందరిపై అభియోగాలు మోపారు. వారిపై వెంటనే చర్య తీసుకోవలసిందిగా కలెక్టరు గారిని కోరారు.

చివరగా పాఠశాల ప్రధానోపాధ్యాయుని వంతు వచ్చింది.

అడుగులు తడబడుతున్నా గంభీరంగానే నిలబడ్డారు ప్రకాశంగారు.

అతనిపై ఏవో ఫిర్యాదులు సంధించేందుకు కొందరు సిద్ధమయ్యారు.

ఊపిరి బిగపట్టి చూస్తున్నారు ఉపాధ్యాయులు.

జిల్లా అధికారిణి శ్రీమతి గిరిజా ప్రభాకర్ ప్రకాశంగారిని చూడడంతోనే ఆయనకు పాదాభివందనం చేశారు.

కలెక్టర్‌గారి చర్యకు విస్తుపోయారు గ్రామస్థులు. వారి కంఠం మూగబోయింది.

ఊహించని ఈ పరిణామానికి ఉలిక్కిపడ్డారు ప్రకాశంగారు. అప్రయత్నంగా ఆశీర్వదిస్తూ ఆమె వంక చూశారు. పోలికలు ఊహకు అందడంలేదు.

"ఈ మాష్టారు మీ పిల్లలకే కాదు, నాకూ గురువుగారే. వీరి అత్యుత్తమ ప్రోత్సాహంతో నేను జిల్లా కలెక్టర్ని అయ్యాను. ఈయన పనితీరు ఎటువంటిదో వేరే ప్రశ్నించవలసిన పనిలేదనుకుంటాను" సభికుల్ని ఉద్దేశించి నవ్వుతూ అన్నది గిరిజా ప్రభాకర్.

ఆ మాటతో ఆమె ఎవరో ఠక్కున గుర్తుకొచ్చింది. ఉన్నఫళంగా గతంలో కెళ్ళారు ప్రకావం గారు.

★ ★ ★

బడికింకా బోలెడంత టైముంది మెల్లగా అడుగులేస్తున్నాడు ప్రకాశం.

అతడి ముందు ముగ్గురు విద్యార్థినులు కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

గిరిజ చేతిలో పుస్తకాలకు బదులు కొడవలి వుంది.

అందుకు అతడేమీ ఆశ్చర్యపోలేదు. పల్లెల్లో అది మామూలే.

చదువుకుంటున్న పిల్లలు వ్యవసాయ పనుల్లో పెద్దలకు సాయపడుతుంటారు. బహుశా ఆ పిల్ల చేలోకి వెళ్తోందేమో! అయినా పరీక్షల్లో బడి మానేసి పొలం పనుల్లోకెళ్ళడమేమిటి? అనుకుంటూనే ఆ విషయం ఆ అమ్మాయిని పిలిచి అడగాలనుకున్నాడు. అయితే వారి మాటల్లోనే అతడి సందేహం నివృత్తి అయిపోయింది.

"మొన్న, నిన్న బడిలో మాస్టారేం చెప్పారు?" అడిగింది గిరిజ.

ఆ మాటల్లో చదువుపట్ల ఆమెకున్న ఆసక్తిని అర్థం చేసుకోవచ్చు.

"ఇంపార్టెంట్ ప్రశ్నలు చెప్పార్లే. ఇవాల్టి నుండి యూనిట్ పరీక్షలు. నువ్వేంటి పరీక్షలకు రాకుండా పొలానికి పోతున్నావు?" అని అడిగింది వారిలో ఓ అమ్మాయి.

"అమ్మ బడి మానేయమంది!"

"స్కూలు మానేసి ఏం చేస్తావ్?"

"కొడవలి ఇచ్చింది కదా గడ్డి కోయమని!" ఆ మాటల్లో తల్లిమీద వున్న కసి వెల్లడవుతోంది.

వారం రోజులబట్టి గిరిజ క్లాసుకు ఎందుకు రావడంలేదో ఇప్పుడర్థమయింది ప్రకాశానికి. ఆ పిల్ల చదువు మానేసిందంటే ఎందుకో అతడికి కడుపులో కెలికినట్లయింది.

నిజానికి క్లాసందరిలో ఆ అమ్మాయే తెలివైంది. పబ్లిక్ పరీక్షలు నిండా నాలుగు నెలలు లేవు. ఇంత వరకూ చదివి ఇప్పుడు మానేయడమేంటి? వాళ్లమ్మకి బుద్ధిలేకపోతే దీని మతేమయింది? చదువుకుంటానని పట్టు పట్టొచ్చుకదా.

ఆ మాటే ఆ పిల్లను పిలిచి అడిగాడు.

"నాకూ చదువుకోవాలనే ఉంది మాష్టారు. అమ్మే మానేయమంటోంది. పరీక్ష ఫీజుకి, ఫోటోలకి వంద రూపాయలు అవుతాయటగదా."

"నేనొచ్చి మీ అమ్మకి నచ్చచెబుతాన్లే. ముందు ఆ కొడవలి పారేసి బడికి రా. అవసరమైతే నీ పరీక్ష ఫీజు నేను కడతాను సరేనా?

"పుస్తకాలు" అంటూ బిత్తరచూపులు చూసింది గిరిజ.

"బుక్స్ చూసిగాని పరీక్ష రాస్తావా?" పరిహాస మాడుతూ రాసుకోవడానికి పెన్ను ఇచ్చాడు ప్రకాశం.

"వద్దండి మాస్టారు. నేను పొలానికి పోకుండా బడికెళ్లానని తెలిస్తే అమ్మ తంతుంది."

"ఆ భయమేమీ పెట్టుకోకు. పద. పరీక్ష అయ్యాక మీ ఇంటికొచ్చి మీ అమ్మతో మాట్లాడతాను."

ప్రిపరేషన్ లేకుండానే పరీక్ష ఫస్టుగా రాసింది గిరిజ. పేపరు చూసి ఆ రోజే అనుకున్నాడు చదివించే వాళ్లుంటే ఈ పిల్ల ఐఎఎస్ పాసై జిల్లా కలెక్టరవుతుందని.

★ ★ ★

అనుకున్నట్లే ఆమె ఎంతో ఎత్తుకు ఎదిగిపోయి తనముందు పర్వతంలా నిలబడింది. అంతేకాదు తను చేసిన చిన్న సహాయాన్ని ఇంతవరకూ గుర్తుంచుకుని కృతజ్ఞత చూపిస్తోంది.

ఆమె వ్యక్తిత్వాన్ని, సంస్కారాన్ని చూసి ముగ్ధుడయ్యాడు ప్రకాశం.

కలెక్టర్ గిరిజా ప్రభాకర్ చర్య అక్కడున్న అధికారులకు, అనధికారులకు విడ్డూరంగా తోచింది.

"జిల్లా అధికారిణివై వుండి ఓ సామాన్య బడిపంతులు ముందు మోకరిల్లడానికి సిగ్గనిపించడం లేదూ?" అంటున్నట్లున్నాయి వారి చూపులు.

"ప్రోత్సహించి విద్యాబుద్ధులు నేర్పి తననింత దాన్ని చేసిన వ్యక్తిని మరచిపోయి అతనిమీదే అధికార దర్పాన్ని ప్రదర్శించాలనుకోవడం కంటే కృతఘ్నత మరొకటుండదు" అంటోంది ఆమె మనసు.

**(25-5-2000, ఆంధ్రభూమి వీక్లీ)**